ఉద్యోగం రావడానికి కారణం స్నేహితులే..

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన శంకర్

వికారాబాద్, మార్చి 9 : సినిమాల్లో చూపించినట్లుగా పేదరికంలో ఉన్న నిరుద్యోగులకు ఒక మంచి స్నేహితుడు దొరుకుతాడు అది సినిమాకే పరిమితం.. ఇది నిజ జీవితంలో చాలా అరుదుగా ఉంటుంది. కానీ ఈ నిరుద్యోగి విషయంలో అది నిజమైంది. ఉండటానికి ఇల్లు లేక.. చదువుకునేందుకు ప్రోత్సాహం లేక.. చదువుకోవడానికి శత విధాలా ప్రయత్నం చేశాడు. బాల్యంలోనే సొంత జిల్లాను వదిలి పక్క జిల్లాకు వచ్చాడు. చదువే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామం బుడగజంగానికి చెందిన లాలయ్య కొడుకు శంకర్. ఇతడికి చిన్నప్పటినుంచి చదువుపై చాలా శ్రద్ధ ఉండేది. బాగా చదివి గొప్ప స్థాయికి చేరుకోవాలని తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. అడుగడుగునా ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మాత్రం వదలలేదు. ఆ ఊరిలో చదువుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో సౌకర్యాలున్న వికారాబాద్ ప్రాంతానికి వచ్చాడు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, బీఈడీ వరకు చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. అతడి చదువుకు స్నేహితులు ప్రవీణ్, గౌతమ్‌కుమార్, శ్రీకాంత్, బాల్‌రాజ్ వీరితో పాటు మరికొంత మంది ప్రోత్సహించారు. చదువుల కోసం ఆర్థికంగా సహాయం చేయడంతో గురుకులాలకు సన్నద్ధమయ్యాడు. గతంలో డీఎస్సీ ఉద్యోగం కోసం ప్రయత్నం చేయగా అతి తక్కువ మార్కులతో ఉద్యోగం చేజారిపోయింది. అయినా నిరుత్సాహపడకుండా స్నేహితుల సహాయంతో కోచింగ్ తీసుకున్నాడు. పుస్తకాలకు, పరీక్ష ఫీజులు, రూమ్ రెంటుకు, తినడానికి స్నేహితులు సహాయం చేశారు. ఒక పూట కడుపు నిండితే మరో పూట పస్తులు ఉండాల్సిన సందర్భాలు అతని జీవితంలో ఎన్నో ఉన్నాయి. స్నేహితులు భోజనం పెడితే తప్ప కడుపు నిండేది కాదు. ఇతడి జీవితంలో పడ్డ కష్టాలు వింటే హృదయాలు చలించిపోయి, కన్నీళ్లు కారిపోతాయి. గత మూడు నాలుగు సంవత్సరాలుగా వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను చదువుకున్నాడు. 2023 ఆగస్టులో గురుకులాల పోస్టులకు పరీక్షలు రాశాడు. ఆ ఫలితాలు ఇటీవల వెలువడంతో టీజీటీలో ఉద్యోగం సాధించాడు. ఇతడి కష్టానికి ఫలితం దక్కింది.

మెళకువలతోనే అధిక దిగుబడి

- ఈసారి మామిడికి అనుకూలమే..
- మార్చిలో జాగ్రత్తలు పాటించడమే కీలకం
- మామిడి రైతులకు పలు సూచనలు చేసిన రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత

ఆరుగాలం కష్టపడి రైతు పండించే పంటలు చేతికందేలోపే చీడపీడల బారిన పడితే? ఆ రైతుకు తీరని నష్టం జరుగుతుంది. ఒక్క రైతుకే కాదు, ఆ కుటుంబానికీ తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటది అనే నానుడిని నిజం చేయాలంటే.. మొదట రైతును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు తమ వంతుగా మామిడి రైతుల కోసం పలు సూచనలు, సలహాలు పాటిస్తే ఈ సీజన్‌లో అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. ఆ విషయాలేంటో తెలుసుకుందాం.

- వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 9

ఈ ఏడాది మామిడికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నా, మార్చి నెలలో తగు జాగ్రత్తలు పాటిస్తేనే అధిగ దిగుబడి పొందవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత సూచిస్తున్నారు. ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు ఎంతో కీలకమని చెప్పారు. మామిడి ప్రస్తుతం పిందె, కాత దశలో ఉందని తెలిపారు. అయితే పిందె, కాయలపై తేనె మంచు, కాండం తొలుచు, కాయ తొలుచు పురుగులు, మసిమంగు, పిండి నల్లి, బూడిద తెగుళ్లు అధికంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే తగు జాగ్రత్తలు పాటించకపోతే అపార నష్టం వాటిల్లుతుందన్నారు. కాయ పెరుగుదల దశలో వీలైనంత వరకు డ్రిప్ ద్వారా చెట్టుకు నీరందించాలని సూచించారు. కాయలకు కవర్ తొడుగు ఉంచడంతో ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు.

తెలంగాణ నుంచే అధిక దిగుబడి

ఈసారి రాష్ట్రం నుంచి మామిడి అధిక దిగుబడి రానున్నదన్నారు. మెళకువలతో మామిడిని రక్షిస్తే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. మామిడిని దేశంలోనే అధికంగా సాగుచేసేది తెలంగాణేనని, అందుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలమని వెల్లడించారు. ప్రస్తుతం తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మామిడి కాయలకు తొడుగులుగా కవర్స్ ఏర్పాటు చేసిన రైతులు

తేనె మంచు పురుగు

ఈ పురుగు ఆకు, పువ్వు, పిందెలపై చేరి రసాన్ని పీలుస్తాయి. పూత, పిందె వాడిపోయి రాలిపోతుంది. పురుగు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసి గల శిలీంధ్రాలు పెరుగుతాయి. దీంతో నల్లని మసిమంగు ఏర్పడుతుంది. ఈ పురుగు కాయ లేని కాలంలో కొమ్మల బెరడులో దాగి ఉంటుంది. అనంతరం లేత ఆకులపై, పూరెమ్మలపై ఉంటుంది. వాతావరణ పరిస్థితుల్లో హెచ్చుతగ్గులు, అంటే చలిగా ఉన్నపుడు ఎక్కువ ఉధృతి పెరుగుతుంది. తేనెలాంటి బంక ఆకులపై చేరడంతో సూర్యరశ్మి వెలుగులో మెరుస్తుంది. తేనె మంచు నివారణకు లీటర్ నీటిలో డైమిథోయేట్ 2 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ తగు మోతాదులో నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలిచే పురుగు

కాండం తొలిచే పురుగు సోకినప్పుడు చెట్టు ఎండిపోతుంది. గట్టి ఇనుప తీగ సహాయంతో పురుగును తొలగించాలి. పురుగు విసర్జన, పురుగు కొమ్మను తట్టినప్పుడు వచ్చే శబ్దాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి.

కాయ తొలుచు పురుగు

ఎండు పుల్లలో నిద్రావస్థ దశలో రెక్కల పురుగు వెలువడి కాయలపై గుడ్డు పెడుతుంది. ఈ పురుగు మామిడి పండ్ల దశలో మూడు తరాలు వృద్ధి చెందుతుంది. అనంతరం పంటను ఆశిస్తాయి. పురుగు ఆశించిన చెట్టును తొలగించాలి.

తెగుళ్లు, మసిమంగు

ఆకులు, పూత, పిందెలు, కాయలపై రసం పీల్చే తేనె మంచు పురుగు, పిండినల్లి, తామర పురుగులు, చీడపీడలు ఆశించినప్పుడు (సోకినప్పుడు).. అవి విసర్జించిన తేనెలాంటి పదార్థంపై శిలీంధ్రాలు క్యాప్‌నోడియం పరాన్నభుక్కులుగా పెరిగి నల్లని మసి తెగుళ్లు వస్తాయి. కొంతకాలం తర్వాత ఇవి మసిమంగుగా మారుతాయి. తెగుళ్లు సోకిన కాయలపై నల్లని మచ్చలుగా ఏర్పడి అవి అమ్మకానికి డిమాండ్ లేకుండా పోతాయి. ఇది ఎక్కువగా మార్చి నెలలో దీని ప్రభావం ఉంటుంది. కనుక జాగ్రత్త అవసరం. జిగురు లేని కాయలపై మసి తెగుళ్లు సోకదు. ఆకు మసి తెగుళ్లు కనిపిస్తే.. 2 శాతం గంజి ద్రావణం పిచికారీ చేయాలి.

పిండి నల్లి

భూమిలో పొదగబడిన గుడ్డు, పిల్ల పురుగులు చెట్ల పైకి పాకుతాయి. చీమల ద్వారా పైకి పాకి గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది. దీని వల్ల కాయలు సరిగ్గా ఎదగకుండా రాలిపోతాయి. నివారణకు మిథైల్ పెరాథియాన్‌ను పిచికారీ చేయాలి. టెంక పురుగు కాయ లోపలికి చొచ్చుకుని పోయి లోపల గోకి తింటుంది. ఇది ఆలస్యంగా కోత దశలో కనిపిస్తుంది. నివారణకు మి.లీ ఫినిట్రోథియాను లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగుళ్లు

ఈ తెగులు ఆకుపై, పూరెమ్మలపై బూడిద వంటి తెల్లని పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. ఇది పూత కాలంలో కనబడుతుంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారీ చేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నాగహర్షిత సూచిస్తున్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థులకు ఐఐసీటీలో శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : కోఠిలోని తెలంగాణ మహిళా యూనివర్సిటీ విద్యార్థులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. సీఎస్ఐఆర్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఆహారం, పోషక రసాయన శాస్త్రంలో అనలిటికల్ నైపుణ్యాలపై, ఫుడ్ ఇండస్ట్రీ రంగంలో ఉన్న అధునాతన కెమికల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు రెండు దఫాలుగా ప్రత్యేక శిక్షణ నిర్వహించినట్లు ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ తరహా స్కిల్ డెవలప్ సెషన్లతో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంచుతాయని వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొండాపూర్, మార్చి 9: మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాపిరెడ్డికాలనీ రాజీవ్‌గృహకల్పలో నివాసముండే రామలింగప్ప(55) కూలీ పనులు చేస్తుంటాడు. మార్చి 8న మద్యం మత్తులో ఉన్న రామలింగప్ప ఇంట్లో నుంచి బయటకువెళ్లాడు. కాగా తన కూతురుతో ఇక్కడ ఉండాలనిపించడంలేదని, తన సొంత గ్రామమైన గుల్బర్గాలోని దుగ్గనూరుకు వెళ్లిపోవాలనుకుంటున్నట్లు చెప్పి వెళ్లాడు. ఎంతకూ అటు ఊరికి, ఇటు స్థానికంగా ఉన్న ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పాపిరెడ్డికాలనీ సమీపంలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడంతో, రామలింగప్ప కుటుంబ సభ్యులకు శనివారం సమాచారమిచ్చారు. మృతుడు రామలింగప్పనేనని నిర్ధారించారు. మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెంది ఉంటాడని ఫిర్యాదు చేశారు.

ఆర్టీఐ చట్టం 150 కోట్ల మంది భారతీయులకు జవాబుదారీతనం

- విద్యావంతులు, జర్నలిస్టులు చట్టాన్ని వినియోగించుకోవాలి
- మాజీ ప్రధాన సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి రాష్ట్రాల మాజీ ప్రధాన ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

ఖైరతాబాద్, మార్చి 9 : సమాచార హక్కు చట్టం ఒకరు.. ఇద్దరిది కాదని.. 150 కోట్ల మంది భారతీయులకు జవాబుదారీతనంగా నిలుస్తుందని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. సమాచార హక్కు సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'సమాచార హక్కు చట్టం, అమలవుతున్న తీరు, ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సమితి రాష్ట్ర అధ్యక్షుడు గాదె పాక మధుకుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని, అయితే అదే చట్టం వల్ల ఇద్దరు కేంద్ర మంత్రులు తమ పదవులు సైతం కోల్పోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అంతటి సత్తా కలిగిన సమాచార హక్కు చట్టాన్ని ప్రస్తుత పాలకులు నిర్వీర్యం చేసే పని పెట్టుకున్నారన్నారు. తాను కమిషనర్‌గా ఉన్న కాలంలో ఏ రోజు కేసులను ఆ రోజే పరిష్కరించే వాడినని, తన హయాంలో ఏడు వేలకు పైగా కేసులను పరిష్కరించానని గుర్తుచేశారు. సమాచారాన్ని ఇవ్వడం వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. నేడు సమాచార హక్కు చట్టాన్ని విద్యావంతులు, న్యాయవాదులు, జర్నలిస్టులు సరిగా వినియోగించుకోవడం లేదన్నారు. ఈ చట్టంలో రాజకీయ నాయకులు సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ డాక్టర్ వీవీ.రావు, ఉభయ రాష్ట్రాల మాజీ చీఫ్ ఇంజినీర్ ఎంఎ కరీం, ఆర్టీఐ కార్యకర్తలు పిట్టల ఈదయ్య, పెరక అభిలాష్, నజబుర్, లుక్మాన్, వంగాల మల్లేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో ఫ్లెక్సీ వార్

సీనియర్లను విస్మరిస్తే ఊరుకునేది లేదంటున్న బీజేపీ మండల నేతలు

కులకచర్లలో ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీ (ఎన్నికల కోడ్ ఉన్నందున తొలగించారు)

కులకచర్ల, మార్చి 9 : మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కులకచర్లలోని చౌరస్తాలో పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి వర్గానికి చెందిన నాయకులు కొంత మంది బీజేపీ నాయకుల ఫొటోలను వేయక పోవడంతో ఆ వర్గంపై మరొక వర్గంవారు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున చౌరస్తాలో తొలగించిన ఫ్లెక్సీలో సీనియర్ బీజేపీ నాయకుల ఫొటోలు వేయకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. జనసంఘ్ నుంచి పార్టీని స్థాపించి ముందుండి నేటి వరకు ఒకే పార్టీలో కొనసాగుతూ పరిగి నియోజకవర్గంలో పార్టీని కాపాడుకుంటూ ముందుకు తీసుకువెళ్లిన సీనియర్ బీజేపీ నాయకులు, మండల అధ్యక్షుల, మోర్చా అధ్యక్షుల, రాష్ట్ర నాయకుల ఫొటోలు ఫ్లెక్సీలో వేయకుండా వివక్షత చూపుతున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అనుచరుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డిపై స్థానిక బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా బీసీలు ఉండే పరిగి నియోజకవర్గంలో మిట్ట పరమేశ్వర్‌రెడ్డి ఆజమాయిషీ ఏంటని బీజేపీ లీడర్లు ప్రశ్నిస్తున్నారు. పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వకపోతే ఎంపీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. పార్టీలో సీనియర్ నాయకులను మరిస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు.

నారీమణులకు నీరాజనం

సమావేశంలో మాట్లాడుతున్న వక్త

మణికొండ, మార్చి 9 : ఎన్నో కష్టనష్టాల మధ్య సామాజిక అవరోధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగి చరిత్రలో ప్రముఖంగా నిలిచిన మహిళలు ఎందరో ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి స్థాపించిన సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నగరంలోని సినారె నిలయం విశ్వంభరలో ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రముఖ మహిళలు పాల్గొని నిన్నటి తరం ప్రతిభామూర్తులైన నారీమణులకు నీరాజనం పలికారు.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. కర్ణాటక సంగీత విద్వాంసురాలు, నర్తకి బెంగళూరు నాగరత్నమ్మ, హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు నైనాదేవీ పట్టుదలతో సంగీత నృత్యాల్లో ప్రావీణ్యం, సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం వంటి భాషల్లో పాండిత్యం సంపాదించి గొప్ప విదుషీమణులుగా పేరుపొంది ధర్మకార్యాలు చేశారని, అయినప్పటికీ ఎన్నో ఈసడింపులకు గురయ్యారన్నారు. అయినప్పటికీ గొప్ప విద్వాంసురాలుగా హిందుస్థానీ సంగీత రంగానికి విశేషమైన సేవలందించారని ఆమె పేర్కొన్నారు.

ప్రముఖ నర్తకి, నాట్య గురువు డాక్టర్ యశోదా ఠాకూర్ మాట్లాడుతూ.. ఆలయ ఆస్థాన నృత్య కలను సుసంపన్నం చేసిన దేవదాసీలను సమాజం, ప్రభుత్వం అనేక కష్టాలకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిక సంపాదకురాలు, రచయిత్రి కొండవీటి సత్యవతి మాట్లాడుతూ.. పీపుల్స్ వార్ నాయకుడు కొండపల్లి సీతారామయ్య భార్య కొండపల్లి కోటేశ్వరమ్మ గొప్ప ఉద్యమకారిణిగా, రచయిత్రిగా అన్నింటికి మించి ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కడవరకూ జీవితంతో పోరు సాగించిన వ్యక్తిగా కోటేశ్వరమ్మ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆమె రచించిన నిర్జన వారధి పుస్తకం చదివితే భర్త అయిన కొండపల్లి సీతారామయ్య చీకటి కోణాలను తెలుసుకోవచ్చన్నారు. సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతం పలుకుతూ భారతీయ సమాజానికి వివిధ రంగాల్లో స్వయం కృషితో సేలందించిన ప్రముఖ మహిళల గురించి ఈ తరానికి తెలియజేసేందుకే నారీమణులకు నీరాజనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి, ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, సినారె కుటుంబ సభ్యులు, ప్రముఖ రచయిత్రులు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు ఓవర్‌లోడ్ గండం

- పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు.. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సమకూర్చని వైనం
- చెట్లకొమ్మల నరికివేతకే పరిమితమైన వేసవి కార్యాచరణ
- రికార్డు స్థాయిలో పెరిగిన విద్యుత్ వినియోగం
- క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లపై గణనీయంగా పెరిగిన లోడ్

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నది. అందుకు తాజా నిదర్శనం.. జీహెచ్ఎంసీ పరిధిలో గతేడాది మార్చి 6వ తేదీ నాటికి 59.53 మిలియన్ యూనిట్లుగా ఉన్న అత్యధిక విద్యుత్ వినియోగం, 2024లో 6న అత్యధికంగా 69.31 మిలియన్ యూనిట్లు, 7న 70.71 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఇలా విద్యుత్ వినియోగం పెరగడం ఈ సీజన్‌లో ఇదే అధికమని అధికారులు ప్రకటించారు. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి తగ్గట్టుగా సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థలు సంసిద్ధమై ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రస్తుత పరిమాణాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణ వేగంగా చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లోని ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై 30 శాతానికి పైగా అదనపు లోడు పడుతున్నది. అక్కడ వెంటనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడం గానీ, దానిపై ఒత్తిడి తగ్గించేలా అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి కనెక్షన్లను తగ్గించడంగానీ చేయాలి.

ఓవర్ లోడ్‌కు ఒక ఉదాహరణ..

సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని గౌలిదొడ్డి ప్రాంతంలో 160 కేవీఏ డీటీఆర్ ఓవర్‌లోడ్‌తో సమస్య ఎదురైందని, లోడ్ బ్యాలెన్సింగ్ కోసం కొత్తగా డిస్ట్రిబ్యూషన్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు ట్విట్టర్ వేదికగా ఎస్ఈ ఆపరేషన్స్ సైబర్‌సిటీ పేరుతో ఉన్న ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్టు చేశారు. ఇది ఒక సర్కిల్‌లో ఒక రోజు వచ్చిన ఫిర్యాదు. ఇలా గ్రేటర్ పరిధిలో మొత్తం 9 సర్కిళ్లు ఉన్నాయి. వాటి పరిధిలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్కువ విద్యుత్ వినియోగం నగర శివారు సర్కిళ్లు అయిన రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్, హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్‌లలో ఉన్నది. ఆ తర్వాత కోర్ సిటీ ప్రాంతమైన హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లు ఉండగా, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్, హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్‌లో విద్యుత్ వినియోగం గతేడాదితో పోల్చితే చాలా పెరిగింది. ప్రతి యేటా విద్యుత్ సంస్థ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను జనవరి నెలలోనే చేపడుతాయి. ఈసారి జనవరి రెండో వారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు వేసవి కార్యాచరణ చేపట్టినా.. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు మాత్రం ఇప్పటికీ జరగలేదు. కేవలం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఒక నివేదికను రూపొందించారు. ఈ రోజుకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద పడుతున్న ఓవర్‌లోడ్‌తో వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నారే తప్ప, అక్కడ అదనంగా అధిక సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం లేదు. ఇలా ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చేసిన మరమ్మతులు మళ్లీ రెండుమూడు రోజులకే పునరావృతం అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ఈసారి ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం, వ్యవసాయంతో పాటు అన్ని కేటగిరీల వినియోదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వినియోగం సైతం భారీగా పెరుగుతున్నది. అదే సమయంలో ఓవర్ లోడ్‌తో విద్యుత్ అంతరాయాలు సైతం అధికంగా ఉన్నాయని వినియోగదారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వెంటనే కొత్తగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలనే వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌సీలు ఇవ్వడానికి భయం

క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరా పరంగా అవసరమైన పనులు చేపట్టేందుకు లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) ఇవ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ఎల్‌సీలు ఇస్తే ఎక్కడ కరెంటు కోతలు విధిస్తున్నారన్న ప్రచారం తలెత్తుతుందన్న భయంతో గత రెండు నెలలుగా ఎల్‌సీలు ఇవ్వడం లేదని, పనులు పూర్తి చేసిన విద్యుత్ కాంట్రాక్టర్లు ఏకంగా సీఎండీని కలిసి విజ్ఞప్తి చేశారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్‌పీడీసీఎల్) పరిధిలోనే రెండు నెలల్లో సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు ఉండగా, వాటికి ఎల్‌సీ ఇస్తేనే కొత్త వారికి విద్యుత్ సరఫరా అందుతుందని, దాని వల్ల విద్యుత్ శాఖకు ఆదాయంతోపాటు పరిశ్రమలు, ఇతర కార్యకలాపాలు సాఫీగా సాగుతాయి. అయినా అవేవీ పట్టించుకోకుండా ఎల్‌సీలను ఇవ్వకుండా తరచూ తలెత్తుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల కోసమే ఎల్‌సీలు తీసుకొని కాలం గడిపేస్తున్నారే తప్ప, సరైన పరిష్కారం చూపడం లేదన్న ఆరోపణలు విద్యుత్ నిపుణులు చేస్తున్నారు.

రాయితీ ఇవ్వండి

నాంపల్లి కోర్టులు, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అందించే సబ్సిడీ రాయితీని వినియోగదారుడికి అందించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను బెంగళూరు వినియోగదారుల కమిషన్-2 ఆదేశించింది. బెంగళూరుకు చెందిన గోవిందరాజుకు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం ఆవాస్ యోజన కింద రూ.25లక్షల లోను మంజూరైంది. పథకంలో భాగంగా సబ్సిడీ పోనూ చెల్లించాల్సిన లోను డబ్బును వాయిదాల రూపంలో చెల్లిస్తుండగా.. బ్యాంకు అధికారులు కలగజేసుకొని మొత్తం డబ్బులు చెల్లించాల్సిందేనని నోటీసు జారీ చేసింది. దీంతో లబ్ధిదారుడు తనకు న్యాయం చేయాలని కోరుతూ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. తన పాత ఇల్లును అమ్మి మొత్తం లోన్ డబ్బులను చెల్లించినప్పటికీ వడ్డీ రాయితీ వర్తింపజేయలేదని విన్నవించాడు. కమిషన్ సభ్యులు విజయ్‌కుమార్, ఎం.పవలే, బి.దేవరాజ్, వి.అనురాధ సమక్షంలో కేసును విచారించారు. లబ్ధిదారుడికి నోటీసులు జారీ చేయడం నిబంధనలను ఉల్లంఘించడమేనని, సబ్సిడీ వడ్డీ రాయితీని వర్తింపజేయాల్సిందేనని కమిషన్ పేర్కొన్నది. లబ్ధిదారుడిని ఇబ్బందులకు గురిచేసినందుకు రూ.5వేల నష్టపరిహారంతోపాటు ఫిర్యాదు ఖర్చులు రూ.2,500 కలిపి సబ్సిడీ రాయితీని చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఢిల్లీ హైకోర్టులో హోగర్‌కు ఊరట

కాపీరైట్ కేసులో అనుకూలంగా ఉత్తర్వులు

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ అంతర్జాతీయ ఐటీ కంపెనీ హోగర్ కంట్రోల్స్‌కు డిజైన్, స్మార్ట్ హోమ్ సొల్యూషన్ ట్రేడ్ మార్క్ కేసులో ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. సంస్థ మాజీ డైరెక్టర్లు ట్రేడ్ మార్క్‌పై నమోదైన కేసుల్లో సంస్థకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ డైరెక్టర్లకు ట్రేడ్ మార్క్‌పై ఎలాంటి హక్కులు లేవని పేర్కొంది. సంస్థకు అనుకూలంగా ఇంజెక్షన్ ఆర్డర్ రావడం హోగర్ కంట్రోల్స్ మొత్తానికి గొప్ప విజయమని సీఈవో విష్ణురెడ్డి విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022 అక్టోబర్‌లో వియత్నామీస్ కంపెనీ లూమీతో కలిసి మాజీ డైరెక్టర్లు సైబర్ దాడులకు పాల్పడ్డారు. అదే విధంగా హోగర్ ట్రేడ్ మార్క్‌తో తప్పుదోవ పట్టించే కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో.. తాజా ఆదేశాలు వినియోగదారుల విశ్వసనీయతను పెంచుకునేందుకు మరింత దోహదపడుతుందన్నారు. కాగా సైబర్ దాడుల కేసులో మాజీ డైరెక్టర్లు విజయ్‌కుమార్ ఆనందాసు, కరుణ్‌కుమార్ ఆనందాసు, మరో నలుగురు వ్యక్తులు గతంలోనే అరెస్టయ్యారు.